# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 19.09.2025 | 24 క్యారెట్లు 11,11.700 | కిలో వెండి 1,41,000 | 29 °C | సంపుటి:3 | సంచిక:263

www.vishalabharati.com





## కృత్రిమ మేధలో రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

**మాదాపూర్:** కృత్రిమ మేధ (ఏఐ)లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దాలనే పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో యూఎంవో డిజైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'యూఎక్స్‌ఇండియా 25' పేరిట ఏర్పాటు చేసిన మూడు రోజుల సదస్సును ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి భట్టి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజైన్ అనేది కేవలం అందానికి కాకుండా సామాజిక మార్పునకు ఆయుధం కావాలని అభిప్రాయపడ్డారు. నగరాన్ని ప్రపంచ డిజైన్ క్యాపిటల్‌గా మార్చడానికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఏదైనా యాప్ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటేనే విజయవంతం అవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సులభంగా ఉపయోగించుకునేలా ప్రాంతీయ భాషల్లోనూ యాప్‌లను రూపొందించాలని సూచించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నగరాన్ని గ్లోబల్ డిజైన్ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో త్వరలోనే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్'ను

మిగతా 2లో



## 'సర్కార్'లోనూ ప్రీ-ప్రైమరీ


- ఆరేళ్లు నిండితేనే ఒకటో తరగతి
- తెలంగాణ విద్యా కమిషన్
- ప్రస్తుతం ఉన్న ఐదేళ్ల నిబంధన
- జూన్ 1 నాటికి అమల్లోకి
- అన్ని రకాల పాఠశాలల్లో వర్తింపు
- పాఠశాలల్లో నాణ్యమైన విద్య
- తెలంగాణ సమాజం పుకార్లు నమ్మదు

" తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల వయసును ఆరు సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుతం ఉన్న ఐదేళ్ల నిబంధనను ఆరేళ్లకు మార్చాలని కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. అంతేకాకుండా.. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రవేశపెట్టాలని సూచించింది. జూన్ 1 నాటికి ఆరేళ్లు నిండిన పిల్లలకు మాత్రమే ఒకటో తరగతిలో ప్రవేశం

మిగతా 2లో



# ఓట్ల దొంగలను ఈసీ రక్షిస్తోంది

### ఓట్ చోరీపై రాహుల్ గాంధీ విమర్శలు

- ఓట్ల దొంగలకు అండగా ఈసీ
- లక్షల మంది ఓట్లు తొలగించారు
- మైనారిటీలు, ఆదివాసీలే టార్గెట్
- పక్కా ఆధారాలతోనే చెబుతున్నాను
- మహిళ పేరుతో ఫేక్ లాగిన్ క్రియేట్
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్లు ఉపయోగిస్తున్నారు

" ఓట్లు తొలగించేందుకు కొందరు వ్యక్తులు వ్యవస్థను హైజాక్ చేస్తున్నారని కాంగ్రెస్? అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓట్ల దొంగలను ఎన్నికల సంఘం రక్షిస్తోందని విమర్శలు గుప్పించారు. ఉద్దేశపూర్వకంగానే లక్షల మంది ఓట్లు తొలగిస్తున్నారని, చాలా చోట్ల మైనారిటీలు, ఆదివాసీల ఓట్లు తొలగించారని తెలిపారు. ఇవన్నీ ఆరోపణలు కాదని, పక్కా ఆధారాలతోనే చెబుతున్నానని స్పష్టం చేశారు. కర్ణాటక అలంద్‌లో గోదాబాయి అనే మహిళ పేరుతో ఫేక్ లాగిన్ సృష్టించారన్న రాహుల్?, ఆమె మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు. ఉద్దేశపూర్వకంగానే లక్షల మంది ఓట్లు తొలగిస్తున్నారు. చాలా చోట్ల మైనారిటీలు, ఆదివాసీల ఓట్లు తొలగించారు.

**విశాలభారతి, నేషనల్:**

ఓట్ల తొలగింపుపై మా వద్ద ఆధారాలు ఉన్నాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో వేలమంది ఓట్లు తొలగించారు. అధికారులకు తెలియకుండా ఓట్లు ఎలా పోతాయి? ఓట్లు తొలగించేందుకు కొందరు వ్యక్తులు వ్యవస్థను హైజాక్ చేస్తున్నారు. ఓట్లు తొలగించాలంటూ వారికి తెలియకుండానే దరఖాస్తు చేస్తున్నారు. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను కావాలనే తొలగిస్తున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్నచోట్ల మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ వివిధ రాష్ట్రాల నుంచి కొనసాగుతోంది. కర్ణాటకలో ఓట్ల తొలగింపుపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన సీఐడీ ఎక్కణ్నుంచి దరఖాస్తు చేశారో ఐపీ నెంబర్లు ఇవ్వాలని ఈసీని

మిగతా 2లో



## రేవంత్ రెడ్డితో బ్రిటన్ హైకమిషనర్

- భారత్‌లోని బ్రిటిష్ హైకమిషనర్
- సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు
- విద్య, సాంకేతిక రంగాల్లో సహకారం
- యూకేలో చదివే విద్యార్థులపై చర్చ
- ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ
- మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలి

" తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారత్‌లోని బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌ను కలుసుకున్నారు. ఈ భేటీలో విద్య, సాంకేతిక రంగాల్లో సహకారం, యూకే విశ్వవిద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులకు అవకాశాలు విస్తరించేందుకు చర్చించారు. చెవెనింగ్ స్కాలర్‌షిప్‌ను కో-ఫండింగ్ విధానంలో తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకారం వ్యక్తమైంది. ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ ఇవ్వడంలో బ్రిటన్ సహకరించనున్నట్లు తెలిపారు.

2



## బతుకమ్మ, దసరాకు 7,754 ప్రత్యేక బస్సులు

- ఈ నెల 30న సద్దుల బతుకమ్మ
- అక్టోబర్ 2న దసరా వేడుకలు
- ఆర్టీసీ ప్రత్యేక చర్యలకు సిద్ధం
- ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు
- అక్టోబర్ 5, 6వ తేదీల్లోనూ రద్దీ
- రాష్ట్రాలకు ప్రత్యేక బస్సులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 7,754 స్పెషల్ బస్సులను నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. అందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక బస్సులను నడపనుంది. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో

మిగతా 2లో

## గిన్నిస్ బుక్ రికార్డులో చేరేలా బతుకమ్మ

- బతుకమ్మ తెలంగాణ సంస్కృతి
- ప్రకృతిని కాపడడం బాధ్యత
- మంత్రి జూపల్లి కృష్ణారావు
- పండుగలో పెద్దఎత్తున పాల్గొనాలి
- ప్రపంచానికి చాటి చెప్పాలి
- ఈ నెల 31వ తేదీ వరకు బతుకమ్మ
- వరంగల్‌లో సంబరాలు ప్రారంభం

2



" బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని, ప్రకృతిని గౌరవించడం, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగలో పెద్దఎత్తున పాల్గొని ప్రపంచానికి చాటి చెప్పాలని తెలిపారు.

## వైఎస్ఆర్‌సీపీలోకి రాజగోపాల్ రెడ్డి?

- ప్రభుత్వంపై రాజగోపాల్ రెడ్డి విమర్శలు
- మంత్రి పదవి రాకపోవడంతో అసంతృప్తి
- పార్టీ మారతారన్న ప్రచారం జరుగుతోంది
- వైఎస్ జగన్‌ను కలుస్తున్నట్లు ప్రచారం
- దీనిపై ఆయన క్లారిటీ ఇచ్చారు
- ప్రతిష్ట దెబ్బతినే విధంగా తప్పుడు వార్తలు
- తెలంగాణ సమాజం పుకార్లు నమ్మదు

2



" తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 50 కార్లతో అనుచరులతో కలిసి ర్యాలీగా విజయవాడ వెళ్లడం రాజకీయవర్గాల్లో సంచలనం సృష్టించింది.

## కమలం పార్టీకి ఈటల రాజీనామా

- బీజేపీలోఈటలకు ఊపిరి ఆడటం లేదు
- పార్టీకి రాజీనామా చేసే ఆలోచన
- వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి
- బీఆర్ఎస్‌లో కూడా విభేదాలు
- ఇప్పుడు కూడా అలాంటి కామెంట్స్
- చేజారిన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి
- ఈటల శిబిరంలో నిరాశ అలుముకుంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీజేపీలో మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు ఊపిరి ఆడటం లేదని సన్నిహితులు చెబుతున్నారు. కమలం పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయి.

మిగతా 2లో



## హైదరాబాద్‌లో కుంభవృష్టి

- హైదరాబాద్ నగరంలో భారీ వర్షం
- ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్
- భారీ వర్షాలు కురిసే అవకాశం
- ప్రజలు బయటకు రావద్దని విజ్ఞప్తి
- గంటలోనే 15 సెంటీమీటర్ల పైగా వర్షం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలో మరోసారి భారీ వర్షం కురుస్తోంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో

మిగతా 2లో



# ఓట్ల దొంగలను ఈసీ రక్షిస్తోంది

మొదటి పేజీ తరువాయి



కోరినా ఇవ్వలేదన్నారు. 18 నెలల్లో సీఐడీ 18 లేఖలు రాసినా స్పందన లేదన్నారు. కర్ణాటక సీఐడీ అడిగిన వివరాలను వారంలోగా ఇవ్వాలని ఈసీని కోరుతున్నామన్నారు. ఓట్ల చోరులను రక్షిస్తోంది సీఈసీ జ్ఞానేష్‌కుమారేనని ఆరోపించారు. "ఓట్ల దొంగలను ఎన్నికల సంఘం రక్షిస్తోంది. మహారాష్ట్రలోని రజూరా అసెంబ్లీలో నకిలీ ఓట్లను సృష్టించారు. మహారాష్ట్ర రజూరాలో 6,850 నకిలీ ఓట్లను జాబితాలో చేర్చారు. ఓట్ల చోరీ పరిశ్రమ నిర్వాహకులు ఎవరో తేలాలి. ఉన్న ఓట్ల తొలగింపు, నకిలీ ఓట్లను సృష్టి రెండూ జరుగుతున్నాయి. నకిలీ ఓట్లు సృష్టిస్తున్నారనేందుకు ఆధారాలు ఉన్నాయి. ఓట్ల చోరులను రక్షించడం మానుకోవాలని సీఈసీని కోరుతున్నాం అని రాహుల్ అన్నారు.

కర్ణాటకలో అలంద్ ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. ఈ నియోజకవర్గంలో ఎవరో 6వేల 18 ఓట్లు తొలగించేందుకు ప్రయత్నించారు. 6వేల 18 ఓట్ల తొలగింపును ఒకరు గుర్తించారు. యాదృచ్ఛికంగానే అది జరిగింది. తన బంధువు ఓటు తొలగించారని బూత్ స్థాయి అధికారిణి గుర్తించారు. పక్కింటి వ్యక్తి ఓటు తొలగించారని ఆమె కనిపెట్టింది. ఇదే విషయాన్ని అతడిని ప్రశ్నించగా తాను తొలగించలేదని చెప్పారు. ఓటు ఉన్న వ్యక్తి లేదా అధికారి తొలగించకుండా ఓటు ఎవరు తీసేశారు. ఎవరో ఈ ప్రక్రియను మొత్తం హైజాక్ చేశారు. "కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఉన్న ఓట్లను తొలగిస్తూ కొత్తగా నకిలీ ఓట్లను ఎలా సృష్టిస్తున్నారో రాహుల్ గాంధీ వివరించారు. మహారాష్ట్రలోని రజూరా అసెంబ్లీ నియోజకవర్గంలో 6,850 నకిలీ ఓట్లను జాబితాలో చేర్చారని అన్నారు. కర్ణాటకలో ఓట్లు తొలగించేందుకు వివిధ రాష్ట్రాల ఫోన్ నెంబర్లు వాడారన్న రాహుల్‌గాంధీ, ఈ నెంబర్లు ఎవరివి? ఎవరు ఆపరేట్ చేశారో? తేలాలన్నారు. సూర్యకాంత్ పేరుతో 12 నిమిషాల వ్యవధిలో 14 దరఖాస్తులు వెళ్లాయన్న రాహుల్, ఆయనకు తెలియకుండానే ఓటు తొలగించాలని దరఖాస్తు చేశారని అన్నారు. ఫేక్ లాగిన్లు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తోనే ఓట్లు తొలగిస్తున్నారని రాహుల్ అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం
19.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## కృత్రిమ మేధలో రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

మొదటి పేజీ తరువాయి

ప్రారంభించనున్నట్లు తెలిపారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ లాంటి సంస్థల ద్వారా తెలంగాణను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న 'ఏఐ ఇన్నోవేషన్ హబ్'లో డిజైనింగ్‌కు పెద్దపీట వేయనున్నట్లు చెప్పారు. యూజర్ ఫ్రెండ్లీగా ఉన్నప్పుడే యాప్ లేదా వెబ్‌సైట్ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఏఐ లాంటి సాంకేతికతలతో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా చూడాలని సూచించారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే అంకుర సంస్థలను సర్కారు ప్రోత్సహిస్తుందని తెలిపారు. యూఎంవో డిజైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కళాధర్ బాపు, సదస్సు కో ఛైర్ రోహన్ తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డితో బ్రిటన్ హైకమిషనర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్ అకాడమీ వంటి రంగాల్లో పెట్టుబడులకు బ్రిటిష్ కంపెనీలు ముందుకు రావాలని సీఎం కోరగా, సానుకూల స్పందన లభించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి మేరకు, విద్య, ఇతర రంగాల్లో సహకారం అందించడానికి బ్రిటిష్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ తాజాగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలుసుకుని ఈ విషయంపై చర్చించారు. ఈ సమావేశంలో కీలక అంశాలపై ఇరువురూ అంగీకారానికి వచ్చారు.

**చెవెనింగ్ స్కాలర్‌షిప్‌లు..**

యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ అంతర్జాతీయ స్కాలర్‌షిప్ ప్రోగ్రాంలో తెలంగాణ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించనున్నారు. కో-ఫండింగ్ ప్రాతిపదికన ఈ స్కాలర్‌షిప్‌లను మెరిట్ విద్యార్థులకు అందించడానికి బ్రిటిష్ హైకమిషనర్ అంగీకరించారు. ఈ స్కాలర్‌షిప్‌ల ద్వారా తెలంగాణ విద్యార్థులు యూకేలోని ప్రముఖ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. తెలంగాణలో కొత్తగా రూపొందించనున్న విద్యా విధానం గురించి కూడా



ముఖ్యమంత్రి బ్రిటిష్ హైకమిషనర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమీ సలహాదారు నళిని రఘురామన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మూసీ నది అభివృద్ధి..**

హైదరాబాద్‌లోని మూసీ నదిని పునరుద్ధరించే ప్రాజెక్టులో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దీని పట్ల హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఇది హైదరాబాద్ నగరాభివృద్ధికి ఒక ముఖ్యమైన ప్రాజెక్టుగా భావిస్తున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అనువైన రంగాలను గుర్తించి, వాటిలో బ్రిటిష్ కంపెనీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని సీఎం కోరారు. ముఖ్యంగా జీసీసీ (గల్ఫ్ కో-ఆపరేషన్ కౌన్సిల్), ఫార్మా, నాలెడ్జ్ సెంటర్లు, వివిధ అకాడమీల వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. హైదరాబాద్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమకు ఒక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నందున.. ఈ రంగంలో యూకే సహకారం మరింత కీలకంగా మారనుంది.

**ఇతర కీలక అంశాలు..**

అడ్మిషన్లు, సౌకర్యాలు.. యూకేలోని విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యార్థుల కోసం అడ్మిషన్ల ప్రక్రియను హైదరాబాద్ నుంచే నిర్వహించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ అందించడానికి బ్రిటిష్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ సమావేశం తెలంగాణ, యూకే మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు.. విద్య, పెట్టుబడుల రంగాల్లో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# 'సర్కార్'లోనూ ప్రీ-ప్రైమరీ

మొదటి పేజీ తరువాయి

కల్పించాలి. మూడేళ్లు నిండిన పిల్లలను నర్సరీలో, నాలుగేళ్లు నిండిన వారిని ఎల్‌కేజీలో చేర్చుకోవాలి. ఈ నిబంధన అన్ని రకాల పాఠశాలలు, బోర్డులకు వర్తించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కమిషన్ కోరింది. ప్రైవేట్ పాఠశాలల్లో మూడేళ్ల నుంచే పిల్లలను చేర్చుకుంటున్నందున, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడానికి ఇష్టపడటం లేదని కమిషన్ గుర్తించింది. దీని వల్ల అణగారిన వర్గాల పిల్లలు నాణ్యమైన ప్రీ-ప్రైమరీ విద్యకు దూరమవుతున్నారని నివేదికలో పేర్కొంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలను ప్రారంభించాలని సూచించింది. దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో మాత్రమే ఒకటో తరగతిలో చేరడానికి ఐదేళ్ల నిబంధన ఉందని, మిగిలిన రాష్ట్రాలు ఆరేళ్ల నిబంధనను ఇప్పటికే అమలు చేస్తున్నాయని కమిషన్ నివేదికలో వివరించింది. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా యూకే, అమెరికా, జపాన్ వంటి ప్రముఖ దేశాల్లో కూడా ఆరేళ్ల నిబంధన అమల్లో ఉందని తెలిపింది. సీబీఎస్ఈ, ఐబీ వంటి అంతర్జాతీయ బోర్డులు కూడా ఇదే విధానాన్ని పాటిస్తున్నాయని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచే వెయ్యి పాఠశాలల్లో 'ప్రీ-ప్రైమరీ' పేరుతో కేవలం యూకేజీని మాత్రమే ప్రవేశపెట్టింది. ఈ దశలో కమిషన్ పూర్తిస్థాయిలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించాలని సిఫార్సు చేయడం గమనార్హం. ఈ మార్పులు అమలులోకి వస్తే.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యత పెరిగి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడానికి మరింత ఆసక్తి చూపవచ్చు. ఈ సిఫార్సులపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం వేచి చూడాలి.

# గిన్నిస్ బుక్ రికార్డులో చేరేలా బతుకమ్మ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బతుకమ్మ పండుగ సంబరాలు జరుగుతాయని వెల్లడించారు మంత్రి జూపల్లి కృష్ణారావు. ఈ నెల 21వ తేదీన వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. గిన్నిస్ బుక్ రికార్డులో చేరే విధంగా సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇవాళ(గురువారం) గాంధీభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ పండుగ బాధల నుంచి పుట్టిందని చరిత్రలో ఉందని వివరించారు. కొత్తగా కవులను, రచయితలను పిలిచి వారితో చర్చించి బతుకమ్మ పాటలు పాడేలా ప్లాన్ చేస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ జరిగే ప్రాంతంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు మంత్రి జూపల్లి కృష్ణారావు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కూడా మన సంస్కృతి తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. బతుకమ్మ పండుగ చేసుకున్న తర్వాత చెరువులో వదలాలని...అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ పండుగపై అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. బతుకమ్మ పండుగ ముఖ్య ఉద్దేశం అందరూ కలిసి ఆత్మీయంగా చేసుకోవాలని. ఇది వ్యక్తుల కార్యక్రమం కాదు అందరి పండుగ అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

కొందరు బతుకమ్మ పండుగను రాజకీయం చేశారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వివిధ రకాల పాటలతో బతుకమ్మను రాజకీయం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ అని ఉద్ఘాటించారు. మొదటిరోజు చేసుకునే ఎంగిలి పువ్వు బతుకమ్మ దగ్గరి నుంచి చివరి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని కాంగ్రెస్ శ్రేణులు ముందుకు వెళ్లాలని సూచించారు. బతుకమ్మ పండుగపై కొన్ని అపోహలు ఉన్నాయని అన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ పండుగ.. తెలంగాణ సంప్రదాయమని చెప్పుకొచ్చారు. బతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో బతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్లీ వచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# బతుకమ్మ, దసరాకు 7,754 ప్రత్యేక బస్సులు

మొదటి పేజీ తరువాయి

ఉంచనుంది. అలాగే, తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబర్ 5, 6వ తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్ లో ప్రధాన బస్టాండ్లైన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్ తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్ బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్ సుఖ్ నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడిపించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

దసరా స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరించనుంది. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదివరకు వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 వ తేదిల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే సవరణ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. అవి యధావిధిగా ఉంటాయి. "బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి సంస్థ సంసిద్ధంగా ఉంది. గత దసరా కంటే ఈ సారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్ లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం" అని సంస్థ ఎండీ సజ్జనార్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. "ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారు. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోంది." అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని ఆయన సూచించారు. టీజీఎస్ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు.

# కమలం పార్టీకి ఈటల రాజీనామా

మొదటి పేజీ తరువాయి



అందుకే పదే పదే ఆత్మగౌరవం, ప్రజలు, పదవులు, గడడిపోచలు అనే కామెంట్స్ తరచూ వినిపిస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కూడా అధినాయకత్వంతో విభేదాలు వచ్చినట్టు ఇలాంటి కామెంట్స్ చేసిన విషయాన్ని ఆయన్ని దగ్గరగా గమనించిన వ్యక్తులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అలాంటి కామెంట్స్ ఈ మధ్య తరచూ చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి వచ్చిన ఉపఎన్నికల్లో విజయం సాధించిన ఈటల రాజేందర్ పరపతి బీజేపీలో బాగానే నడిచింది. మొన్నటి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం నాయకుల పేర్లు పరిశీలించినప్పుడు కూడా ఆయన పేరు ప్రస్తావనకు వచ్చింది. ఒకానొక దశలో ఈటలే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కాబోతున్నారని ప్రచారం కూడా జరిగిపోయింది. ఆయన ప్రధానమంత్రితో భేటీ కావడంతో ఆ ప్రచారం నిజమని కూడా వార్తలు వచ్చాయి. సడెన్‌గా ఎవరూ ఊహించని రామచంద్రరావును బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్‌గా చేశారు. దీంతో ఒక్కసారిగా ఈటల శిబిరంలో నిరాశ అలుముకుంది. దీనికి తోడు ఆయన ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్నారనే ప్రచారం ఆయన వర్గంలో గట్టిగా వినిపిస్తోంది. దీనికి తోడు ఆయన కోవర్టుగా ముద్రించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే నియోజకవర్గం నుంచి దూరం చేసే పనులను ప్రత్యర్థులు చేస్తున్నారని సన్నిహితులు వాపోతున్నారు.

కొత్త అధ్యక్షుడు వచ్చిన తర్వాత ఈటల పార్టీలో కష్టాలు మరింత ఎక్కువయ్యాయనే మాట పదే పదే వినిపిస్తోంది. క్రమంగా పార్టీకి దూరంగా జరుగుతున్నారనే వాదనకు బలం చేకూరే ఘటనలు తరచూ జరుగుతున్నాయి. సెప్టెంబర్ 17న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హైదరాబాద్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో ఈటలకు అవమానం జరిగిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాజ్‌నాథ్‌ను కలిసేందుకు ఒక పాస్ అడిగనట్టు తెలుస్తోంది. ఇచ్చేందుకు పార్టీ ముఖ్యులు అంగీకరించలేదని బోగట్టా. ఆ పాస్ ఇవ్వకపోవడంతో అక్కడి నుంచి కోపంగా లేచి వెళ్లిపోయేందుకు సిద్ధమైనట్టు సన్నిహితులు చెబుతున్నారు. వెంటనే అక్కడే ఉన్న కొందరు ఆయన్ని శాంతిపజేసి పరిస్థితి చక్కదిద్దారని అంటున్నారు. ఈ మధ్య ఫామ్‌హౌస్‌తో తన నియోజకవర్గంలో కలిసిన కార్యకర్తలను ఉద్దేశించి చేసిన కామెంట్స్ మాదిరిగానే గురువారం కూడా ఆత్మగౌరం, పదవులకు రాజీనామాపై మాట్లాడారు. కోరిన పదవులు దక్కపోయినా బాధపడబోమని కానీ ఆత్మగౌరవం లేకపోతే కచ్చితంగా కొట్లాడాతామని హెచ్చరించారు. ఉద్యమ సమయంలో పదవులను గడ్డిపోచల్లాగా వదిలేశామని గుర్తు చేశారు. 20 ఏళ్లలో ఎవరైనా నాలుగుసార్లు ఎమ్మెల్యే అవుతారని కానీ తాను మాత్రం 7 సార్లు ఎమ్మెల్యే అయ్యానని రాజీనామాల విషయాన్ని ప్రస్తావించారు. అధ్యక్ష పదవి ఇవ్వకపోయినా కనీస గౌరవం దక్కడం లేదన్న అసంతృప్తితో ఈ కామెంట్స్ చేశారని అంటున్నారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం కాప్రాలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ ఈటల రాజేందర్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూనే పార్టీలో తనను అవమానిస్తున్న వాళ్లకు, బీజేపీ అధినాయకత్వానికి సంకేతాలు ఇచ్చారు. ఆయన ఏమన్నారంటే" మనం నిన్న(సెప్టెంబర్ 17) ఎగురవేసుకున్న జాతీయ జెండా తెలంగాణ ప్రజల రక్త తర్పణాన్ని గుర్తు చేసింది. దేశంతో పాటు మనకు స్వతంత్రం రాలేదని, దానికోసం మన పూర్వీకులు పడ్డ కష్టం భావితరాలకు అందించడమే నిన్న వేడుకల లక్ష్యం. అభివృద్ధి కావాలా ? ఆత్మగౌరవం కావాలా అంటే ముందు కోరుకొనేది ఆత్మగౌరవం, స్వయం పాలన.. కానీ ఆనాడు అది లేకుండే. ఆత్మగౌరవం కోల్పోయిన తరువాత వచ్చే ఏ పదవైనా గడ్డి పోచతో సమానం. తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్యే పదవిని గడ్డి పోచలాగా విసిరి వేసినం. ఇరవై ఏళ్ళల్లో 4 సార్లు ఎమ్మెల్యే కావాల్సింది 7 సార్లు అయ్యాం. మాకు ఆత్మగౌరవం, స్వయంపాలన కావాలని కొట్లాడినం." అని అన్నారు.

## వైఎస్ఆర్‌సీపీలోకి రాజగోపాల్ రెడ్డి?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**


ఆయన తాడేపల్లిలో వైఎస్ జగన్ ను కలిసి ఆ పార్టీలో చేరిపోతారని.. తెలంగాణలో వైఎస్ఆర్‌సీపీకి నాయకత్వం వహిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఖండించారు. తాము ర్యాలీగా వెళ్తోన్నది ఓ వేడుకలో పాల్గొనడానికి అని.. ఆయన స్పష్టం చేశారు. గుంటూరులో వైసీపీ నేత మోదుగుల వేణుగోపాల్ రెడ్డి ఇంట్లో ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లామని రాజగోపాల్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరవ్వడానికి వెళ్తుంటే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి గారిని కలవడానికి వెళ్తున్నాడని పుకార్లు సృష్టిస్తున్నారని అన్నారు. తాను గుంటూరు వెళుతున్నాను అంటే మా నియోజకవర్గంలో నుంచి కూడా కొంతమంది నాయకులు నాతో వస్తా అన్నారని.. నేను మా నాయకులు కలిసి గుంటూరులో ప్రవేట్ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత అటు నుండి విజయవాడ వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకొని వద్దామని వెళ్తున్నామని రాజగోపాల్ రెడ్డి చెప్పారు. దానికే తాను జగన్ ని కలవడానికి వెళ్తున్నానని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన రాజకీయం గురించి నా భవిష్యత్తు గురించి నేను మీడియా సమావేశం పెట్టి చెబుతాను తప్ప అప్పటివరకు ఈ దుష్ప్రచారాలను నమ్మకండని తెలంగాణ సమాజాన్నికోరారు. ఇదొక్కటే కాదని తనపై మీడియాలో, సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వస్తున్నాయన్నారు. కొన్ని చానల్లో సోషల్ మీడియాలో నా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బ తినే విధంగా తప్పుడు వార్తలు వస్తున్నాయని.. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి లేదన్న రాజగోపాల్ రెడ్డి అనే శీర్షికన నేను అనని మాటలు అన్నట్లు ప్రచురించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి గురించి మొట్టమొదటి అసెంబ్లీలో ప్రస్తావించిందే తాను అని గుర్తు చేశారు. మంత్రి పదవి రానందుకు రేవంత్ రెడ్డి పైన, ప్రభుత్వం పైన నేను అనని మాటలను అన్నట్టు తప్పుడు కథనాలను సృష్టించి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఒకసారి ఎంపీగా ఒకసారి ఎమ్మెల్సీగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాకు కాంగ్రెస్ పార్టీ అన్న సోనియా గాంధీ ,అన్న రాహుల్ గాంధీ గారు అన్నా ఎంతో అభిమానమని రాజగోపాల్ రెడ్డి చెప్పారు. నేను రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని తప్పుడు వార్తలు రాస్తున్నారన్నారు. కొందరు గిట్టని వ్యక్తులు నా ప్రతిష్ట దెబ్బతీయడానికి సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలు పుకార్లు ప్రచారం చేస్తున్నారు .. దయచేసి తెలంగాణ సమాజం పుకార్లను నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కొన్ని సందర్భాలలో అంతర్గతంగా, బహిర్గతంగా ఈ విధంగా చేస్తే బాగుంటుంది అని కొన్ని వేదికల్లో చెప్పడం జరిగింది కానీ వేరే ఉద్దేశం లేదన్నారు.

# హైదరాబాద్‌లో కుంభవృష్టి

మొదటి పేజీ తరువాయి

భారీ వర్షం కురుస్తోంది. పంజాగుట్ట, ఖైరతాబాద్, లకిడికాపూల్, నాంపల్లి, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో సైతం భారీ వర్షం పడుతోంది. బషీర్బాగ్, అబిడ్స్, కోఠి, హిమాయత్ నగర్లలో మోస్తారు వర్షం కురుస్తోంది. ఎల్బీనగర్, ఉప్పల్, హయత్ నగర్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షం పడుతోంది. ఐటీ కారిడార్‌తో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరో రెండు గంటల పాటు మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని జీహెచ్‌ఎంసీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చేందుకు అవకాశముండటంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇదిలా ఉంటే.. నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అమీర్‌పేట్, మాదాపూర్, బాగ్ లింగంపల్లి ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్.. పైనుండి వస్తున్న భారీ వరదతో మైత్రివనం వెనుక ఉన్న గాయత్రీ నగర్‌కి వరద ముప్పు ఉన్నట్లు గుర్తించారు. మైత్రివనం వద్ద చేసినట్లుగానే గాయత్రి నగర్‌లో కూడా నాలాలో సిల్ట్ తొలగించాలని స్థానికులు హైడ్రా కమీషనర్ రంగనాథ్ కోరారు. నాళాల్లో పూడిక తీసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు హైడ్రా కమిషనర్ హామీ ఇచ్చారు. దుర్గం చెరువులో నీటిమట్టం తగ్గించడంతో కొంతమేర పరిసర కాలనీలకు ముంపు సమస్య తీరనున్నట్లు హైడ్రా కమిషనర్ గుర్తించారు. క్లౌడ్ బరస్ట్



కారణంగా గంట వ్యవధిలోనే 15 సెంటీమీటర్ల పైగా వర్షం పడడంతో ఇబ్బందులు తలెత్తాయని హైడ్రా కమీషనర్ స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితులను తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాగ్ లింగంపల్లిలో నీట మునిగిన శ్రీరామ్ నగర్ కాలనీలో పర్యటించిన హైడ్రా కమిషనర్.. కాలనీ నుంచి వరద నీటిని త్వరగా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రెండు రోజుల్లో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్ సూచించారు.

## 19 మంది జి.పి.ఓలు విధుల్లోకి



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** భూ భారతి చట్టం-2025 పరిధిలో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్టు మండలానికి కొత్తగా నియమించబడిన గ్రామ పంచాయితీ అధికారులు (జి.పి.ఓలు) విధుల్లోకి చేరారు. మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) సమక్షంలో జి.పి.ఓలు నియామక పత్రాలను స్వీకరించి, అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గ్రామ పంచాయితీల అభివృద్ధి, శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు సకాలంలో సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయితీలలో పారదర్శకంగా పని చేసి ప్రజల విశ్వాసం పొందడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యం ఆర్ ఓ సుదర్శన్ రెడ్డి, ఎంపీడీఓతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ సంబరాలకు ఉప్పలకు ఆహ్వానం

**ఎల్బీనగర్, విశాలభారతి:**

నాగోల్ లోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసానికి అరుణోదయ కళాకారిణి. ప్రజా ఉద్యమాల పోరాట వనిత విమలక్క వచ్చి బహుజన బతుకమ్మ సంబరాలకు రావాలని ఆహ్వానం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తన నివాసానికి వచ్చిన విమలక్క కి ఉప్పల శ్రీనివాస్ గుప్త చీర నీ పెట్టడం జరిగింది. విమలక్క మాట్లాడుతూ ప్రకృతి విధ్వంసమంటే ప్రజలపై యుద్ధమేనంటూ శాంతి - స్వావలంబణను చాటుదాం ప్రకృతి రక్షణే ప్రజల రక్షణగా బహుజన బతుకమ్మను సెప్టెంబర్ 20 నుండి అక్టోబర్ 3 వరకు ఊరూరా వాడవాడలా ఉద్యమంగా జరుపుకుందాం అని ఆమె అన్నారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని కాపాడుతున్న విమలక్కకు అభినందనలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ పై అనుచిత వాక్యాలను ఖండించిన కాంగ్రెస్

**వాజేడు, విశాలభారతి:**



ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పై టిఆర్ఎస్ పార్టీ నాయకుడు సింజెంటా కంపెనీ మొక్కజొన్న ఏజెంట్ గూడవర్తి నరసింహమూర్తి అనే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని, వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజు . మాట్లాడుతూ.. మొక్కజొన్న ఏజెంట్ గా ఉండి ఏజెన్సీ ప్రాంత రైతులకు నకిలీ మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి తీవ్రంగా నష్టానికి గురి చేస్తే రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మంత్రి సీతక్క ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ నిలబడి ఐదు మండలాల 671 మందిరైతుల పక్షాన న్యాయం చేసినందుకు కక్షగట్టి ములుగు జిల్లా కలెక్టర్ పై టిఆర్ఎస్ నాయకుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఏనాడు కూడా రైతుల పక్షాన నిలబడి రైతులకు న్యాయం జరిగేంత వరకు శ్రమించి పనిచేసిన ప్రభుత్వం గానీ కలెక్టర్ గానీ లేదని మొక్కజొన్న కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి రైతులకు నష్టపరిహారం ఇప్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అదే విధంగా ములుగు జిల్లాను అభివృద్ధి దిశగా నడిపిస్తున్న జిల్లా కలెక్టర్ దివాకర్ పై కక్షగట్టి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని, టిఆర్ఎస్ పార్టీ సమావేశంలో గూడవర్తి నరసింహమూర్తి మాట్లాడుతూ తనకున్న యావదు ఆస్తి అమ్ముకోనైన టిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పనిచేస్తాను టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ములుగు జిల్లా కలెక్టర్ పై కక్ష సాధింపు చర్యలు చేపట్టాలని ఆయన పేరును డైరీలో రెడ్ అక్షరాలతో మన పార్టీ రాసుకోవాలని వ్యాఖ్యానించడం సరైన పద్ధతి కాదని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు దాట్ల వాసు, సొసైటీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాథరాజు, నాగారం మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుముల సంజీవ చెన్నం ఎల్లయ్య కాళీ కృష్ణ, చెన్నం రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటిన జర్నలిస్టులు

### క్షతగాత్రుడైన తోటి జర్నలిస్టుకు ఆర్థిక సహాయం అందించిన టిడబ్ల్యూజేఎఫ్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

త్రినేత్రం పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్న బసవోజు నాగేశ్వర చారి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఎడమ కాలు విరిగింది. ఈ విషయం తెలుసుకున్న టిడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్) జర్నలిస్టులు సహానుభూతి చూపారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొట్లపల్లి అశోక్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో, వనస్థలిపురంలోని రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగేశ్వర చారిని పరామర్శించి, ?10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, "ప్రమాదంలో గాయపడిన తోటి జర్నలిస్టులకు అండగా నిలబడటం ప్రతి ఒక్కరి బాధ్యత. జర్నలిస్టుల మధ్య పరస్పర సహకారం అవసరం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం జర్నలిస్టు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండలో బీజేపీ సేవాపక్షం కార్యక్రమాలు

### ఆస్పత్రులు, పాఠశాలల్లో పండ్ల పంపిణీ

**వలిగొండ, విశాలభారతి:**

వలిగొండ భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొల్ల సుదర్శన్ సారధ్యంలో బీజేపీ "సేవా పక్షం" కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం లో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని సంగెం, వర్కట్‌పల్లి గ్రామ శక్తికేంద్ర పరిధిలో స్వచ్ఛ భారత్ మండల కన్వీనర్ మంద నరసింహ, సేవాపక్షం మండల కన్వీనర్ కందుల తానేష్ ఆధ్వర్యంలో వర్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "ప్రజలకు సేవ చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు శుభ్రంగా, పరిశుభ్రంగా ఉండడం ఎంతో అవసరం. అందుకే సేవాపక్షం లో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఈరోజు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించడం జరిగింది" అని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా బూత్ అధ్యక్షుడు మండలోజు రాజేశ్వర చారి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ, ఆస్పత్రి సిబ్బందిని పార్టీ తరఫున శాలువాలతో సన్మానించారు. కార్యక్రమాలలో బీజేపీ వలిగొండ మాజీ అధ్యక్షుడు నాగెల్లి సుధాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి గౌడ్, మండల ఉపాధ్యక్షుడు మందుల నాగరాజు, నాయకులు పోల్ నాగయ్య, నాగెల్లి సాగర్ గౌడ్, గంగాపురం భాస్కర్, గంగాపురం శ్రీనివాస్, పబ్బు రమేష్, ఏరువ కృష్ణ, సైదుల్ రెడ్డి, శశికుమార్, నాగెల్లి సందీప్ గౌడ్, నారీ లింగస్వామి, మహేష్, చెరుక దానయ్య, గొలనుకొండ అశోక్, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాలికల హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

**తొర్రూరు, విశాలభారతి:**

తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్తి నారి సశక్త పరివారు కార్యక్రమంలో భాగంగా గురువారం బాలికల హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి డాక్టర్ ప్రనీత (గైన కాలోజి ) హాజరయ్యారు. డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి శిబిరాన్ని సందర్శించారు, స్వస్తా నారి స్వశక్తి పరివారు కార్యక్రమం గురించి అధిక రిస్క్ కేసుల గురించి ఆరా తీశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి సుమారుగా 60 మంది స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్రాజు, మెడికల్ అధికారి డాక్టర్ నందన, వైద్యులు డాక్టర్ మీరాజ్, డాక్టర్ మానస,సూపర్ వైజర్లు సుందరి, కమల, మేరీ, ఏఎన్ఎం, ఎంపిహెచ్ఎ,అశాలు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**బోడుప్పల్, విశాలభారతి:**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ అయోధ్య నగర్ కాలనీలో 45 లక్షల నిధులతో నూతన సిసి రోడ్ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, స్థానిక మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ పాండు గౌడ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## దేశాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత మోడీదే

### పాల్గొన్న కడారి కల్పన బిజెపి పట్టణ అధ్యక్షులు

**చౌటుప్పల్ విశాల భారతి:**



భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ 3వ, వార్డు లింగోజిగూడెం 28,29 వ బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75 వ జన్మదిన సందర్భంగా సేవా పక్షం-2025 గాను స్వచ్ఛభారత్, ఆత్మనిర్భర భారత్,వికసిత్ భారత్, రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు పలు సేవా కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగోజిగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చౌటుప్పల్ పట్టణ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్ పాల్గొని పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం జరిగింది. అదేవిదంగా మన దేశ ప్రధాని నరేంద్ర మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ,బిజెపి పార్టీ పిలుపుమేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. తదనంతరం వారు మాట్లాడుతూ మోడీజీ మన దేశ ప్రధానిగా ఉండడం మన అదృష్టంగా భావిస్తూ దేశ ప్రజల కోసం ఎన్నో సంక్షేమాలు అమలుపరిచిన వ్యక్తి, ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ మన దేశాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత దేశ ప్రధాని నరేంద్ర మోడీకే చెందుతుందని ఈ సందర్భంగా వారు అన్నారు. పట్టణ ప్రజలంతా స్వచ్ఛభారత్ లో పాల్గొని మన పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లింగోజిగూడెం మాజీ సర్పంచ్ రమణ గౌని శంకరయ్య,ఇటికాల దామోదర్ రెడ్డి కడారి ఐలయ్య పర్నే అంజిరెడ్డి ఉదరి రంగయ్య పర్నే శేఖర్ రెడ్డి ఎర్రగోని మల్లేశం బోసి కృష్ణ పిల్ల శ్రీధర్ బాతరాజు గణేష్ శివ శంకర్ బొడ్డు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## బహిరంగ సభకు మాజీ కౌన్సిలర్ గౌని భాస్కర్ గౌడ్‌కి ఆహ్వానం

### బీసీ, ఎస్సి, ఎస్టీ - జేఏసీ రాష్ట్ర కార్యదర్శి టి రవీందర్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

అక్టోబర్ 13న హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ లో సామజిక న్యాయం, రాజ్యాధికారం కోసం బీసీ, ఎస్సీ ఎస్టీ- జేఏసీ బహిరంగ సభకు ప్రజల విశేష స్పందన లభిస్తోంది. ఈ సభను విజయవంతం చేయడానికి జేఏసీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రముఖ నాయకులను, ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, పసుమముల గ్రామ మాజీ సర్పంచ్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గౌని భాస్కర్ గౌడ్ ని జేఏసీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి సభ ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ – "తెలంగాణ లో సామాజిక న్యాయం, రాజకీయ హక్కుల సాధన కోసం జరగనున్న ఈ బహిరంగ సభలో మీ వంటి ప్రజా నాయకుల మద్దతు చాలా అవసరం. రాష్ట్ర జనాభాలో 90కు పైగా ఉన్న BC, SC, ST వర్గాలకు తగిన ప్రాతినిధ్యం రావాలంటే ఐక్యంగా పోరాడాలి" అని పేర్కొన్నారు. ఆహ్వానం స్వీకరించిన గౌని భాస్కర్ గౌడ్ గారు మాట్లాడుతూ – "తెలంగాణ లో సామాజిక న్యాయం, రాజ్యాధికారం కోసం జరుగుతున్న ఈ ఉద్యమం చాలా అవసరమైంది. బహిరంగ సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. నా ఆశీర్వాదం, సహకారం ఎల్లప్పుడూ ఉంటాయి" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన నాయకులు, మండల అధ్యక్షులు నాగార్జున, మండల యువజన నాయకులు యం భరత్,స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి

### ఆర్డీవో శ్రీదేవి

**మునుగోడు, విశాలభారతి:**

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంను గురువారం రోజున ఆర్డీవో శ్రీదేవి సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ. రైతులకు యూరియా సరిపడా అందుబాటులో ఉంచాలని తెలిపారు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో. మండల వ్యవసాయ అధికారిఎస్ పద్మజ, తాసిల్దార్ నేలపట్ల నరేష్, ఆర్ఐ వంశీ, వ్యవసాయ సహకార సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థిగా దేదీప్య

**కూకట్ పల్లి విశాలభారతి:**



ప్రతి సంవత్సరం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థి పురస్కారంలో భాగంగా ఈ సంవత్సరం కూకట్పల్లి నియోజకవర్గం లోని దీనబందు కాలనీలోని కాకతీయ హై స్కూల్ నుండి పదవతరగతి అభ్యసిస్తున్న డి. దేదీప్య ను ఉత్తమ విద్యార్థినిగా నిర్ణయించి అవార్డు అందచేయడం జరిగింది. అనంతరం కాకతీయ స్కూల్ డైరెక్టర్ తిరుపతి రావు మాట్లాడుతూ.. విద్యార్థిని దేదీప్య ఎంతో శ్రద్ధతో చదివి ఉత్తమ విద్యార్థిగా ఎంపికవ్వడం తనకు ఎంతో ఆనందంగా ఉందంటూ.. ఇలానే మన స్కూల్ ప్రతీ విద్యార్థి శ్రద్ధతో చదివి ఎంతో.. ఉన్నతస్థాయికి ఎదిగి తల్లితండ్రులకు, పాఠశాల యాజమాన్యానికి మంచిపేరు తేవాలంటూ.. ఇలాంటి పురస్కారాలు మరెన్నో సాధించాలని అన్నారు. విద్యార్థిని అమ్మ ( నాగమణి ) మాట్లాడుతూ వారి కుమార్తె దేదీప్య కు ఉత్తమ విద్యార్థి అవార్డు రావడం నాకు ఎంతో గర్వకారణంగా ఉందని తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. కాకతీయ హై స్కూల్ యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. ఎస్.యెన్. మూర్తి వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వరి, స్కూల్ ఉపాధ్యాయని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రధాని జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు


విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం
19.09.2025
హైదరాబాద్
4
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily
GENERAL NEWS


### జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కొత్తపల్లి జైపాల్ రెడ్డి



**పెద్ద అంబర్‌పేట్, విశాలభారతి:** పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ ఎన్.ఎస్.యూ.ఐ అధ్యక్షులు మర్యల భారత్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పసుమముల గ్రామ మాజీ సర్పంచ్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి ప్రత్యేకంగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మర్యల భారత్ ని అభినందించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ , యువతను ప్రోత్సహిస్తూ ప్రజాసేవలో ముందంజలో ఉన్న ఎన్.ఎస్.యూ.ఐ నాయకత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తపల్లి సంతోష్ రెడ్డి యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గుండెపు మధు గౌడ్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా "భారతీయ జనతా పార్టీ" ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు గూడెపు మధు గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు పండ్లు, స్వీట్స్ పంచడం జరిగింది. ఈ సందర్భంగా మధు గౌడ్ మాట్లాడుతూ, ప్రజాసేవే మోదీ జీవన లక్ష్యం అని, ఆయన పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పార్టీ కార్యకర్తలు ప్రజలతో మరింత దగ్గర అవుతారని తెలిపారు. మహిళల ఆనందం, ఆశీర్వాదాలే ఈ కార్యక్రమానికి నిజమైన విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్కెట్ అభివృద్ధి కోసం కార్యసాధకుడిని అవుతా

### రైతు సంక్షేమం కోసం పాటు పడతా

### చిలుక మధుసూదన్ రెడ్డి

### గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం బాటసింగారం పండ్ల మార్కెట్‌లో సాధారణ సమావేశం ఘనంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించబడింది. ఈ సమావేశంలో ప్రసంగించిన చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, "మార్కెట్ అభివృద్ధి కోసం కార్యసాధకుడిగా ఉంటాను. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తాను. వర్షాకాలం కారణంగా దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతు చేయాలని, మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికార యంత్రాంగం పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి" అని స్పష్టం చేశారు. అలాగే మార్కెట్‌ను మరింత ఆధునీకరించి, రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పలు విభాగాల అధికారులు, సిబ్బంది హాజరై మార్కెట్ అభివృద్ధి, సౌకర్యాల విస్తరణ, పరిశుభ్రత, రవాణా సదుపాయాలపై తమ సూచనలు తెలిపారు. సమావేశం అంతటా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సభ్యులు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. మార్కెట్ అభివృద్ధి దిశగా ఈ సమావేశం కీలక నిర్ణయాలకు వేదిక అయింది. రైతుల సంక్షేమం కోసం కమిటీ మరింత సమర్థవంతంగా పనిచేయాలని నిర్ణయించుకుంది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చె. బాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, సభ్యులు అంజయ్య, లక్ష్మి, బండి మధుసూదన్ రావు, జైపాల్ రెడ్డి, రఘుపతి రెడ్డి, నర్సింహా, గోవర్ధన్ రెడ్డి, గణేష్ నాయక్, మచ్చేందర్ రెడ్డి, నవరాజ్, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



## పోరాట యోధుడికి సన్మానం

### తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటా వారోత్సవాలు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

77వ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటా వారోత్సవాల సందర్భంగా గురువారం ఇబ్రహీంపట్నంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ పోరాట యోధుడు, ఇబ్రహీంపట్నం మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ కొండిగారి రాములుని సిపిఐ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, "కామ్రేడ్ కొండిగారి రాములు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారు. రైతాంగం హక్కుల కోసం, సమాజ సమానత్వం కోసం జీవితాంతం పోరాడారు. వీరి పోరాటం ఈ తరం యువతకు మార్గదర్శకంగా నిలుస్తుంది" అని కొనియాడారు. పార్టీ నాయకులు ఈ వారోత్సవాల ద్వారా రైతాంగ పోరాట చరిత్రను కొత్త తరం లోకానికి పరిచయం చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారన్న, కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, కావలి నరసింహ, సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్టు మండల కార్యదర్శి అజ్మీరా హరి సింగ్ నాయక్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్, నరసింగం సుధాకర్, ములుగు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# సిఎండి బస్తీ బాట

**రాజేంద్రనగర్, విశాలభారతి:**



టిజిఎస్పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్లోని శివరాంపల్లి సెక్షన్, రాజేంద్రనగర్ సెక్షన్ గురువారం పర్యటించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకొని వెనువెంటనే సమస్యలను పరిష్కరించేందుకు ఈ బస్తీబాట కార్యక్రమాన్ని ప్రతి వారంలో మూడు రోజులు నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు. శివరాంపల్లి గ్రామంలో పర్యటిస్తూ తక్కువ ఎత్తులో ఉన్నటువంటి ఎల్టి లైన్లను ఏబి కేబుల్తో మరియు 11 కెవి 33కెవి లైన్లను భూగర్భ కేబుల్ తో మార్చడానికి కావలసిన ఎస్టిమేషన్లను వెంటనే తయారుచేసి సాంకేతిక అనుమతులను పొంది పనులను ప్రారంభించవలసిందిగా విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బందిని అన్నివేళలా వినియోగదారులకు అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యుత్తును అందించేలా కష్టపడి పని చేయాలని సూచించారు. అదేవిధంగా రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ దగ్గర నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ హైకోర్టు భవన స్థలంలోని విద్యుత్ లైన్ల తొలగింపు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ శ్రీ నరసింహులు, రాజేంద్రనగర్ సర్కిల్ సూపర్ఇంటెండింగ్ ఇంజనీర్ డిఎస్ మోహన్, రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజనీర్ రత్నాకర్ రావు, రాజేంద్రనగర్ సబ్ డివిజనల్ ఇంజనీర్ జి సత్యనారాయణ, రాజేంద్రనగర్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### మోడీ జన్మదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

### మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్

### రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకొని, సేవ పక్వాడా - సేవ పక్షం కార్యక్రమంలో భాగంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం మెగా హెల్త్ క్యాంప్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎల్.బి.నగర్, మన్సూరాబాద్ డివిజన్‌లోని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, జి హెచ్ యం సి కార్పొరేటర్లు కళ్లెం నవ జీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహ్మా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "ప్రధాని మోడీ పుట్టినరోజును సేవా దినోత్సవంగా జరపడం గొప్ప సాంప్రదాయం. రక్తదానం అంటే ప్రాణదానంతో సమానం అని యువత అందరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 80 నుండి 100 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బండారి భాస్కర్, బోల్గాం యశ్పాల్ గౌడ్, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, రంగా నరసింహ గుప్తా, బద్దం ప్రేమ మహేశ్వర్ రెడ్డి, నాయకోటి పవన్ కుమార్, చింతల సురేందర్ యాదవ్, అలాగే డివిజన్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కమిటీ సభ్యులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివిధ అంశాలపై సమావేశాన్ని నిర్వహించిన కమిషనర్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

గురువారం మధ్యాహ్నం 12.00 గంటలకు బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ కార్యాలయ కౌన్సిల్ హాల్, యందు పి శ్రీధర్, ప్రత్యేక అధికారిచే సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశము నందు స్వచ్ఛత హి సేవ 2025 కార్యాచరణ ప్రణాళిక, రుతుపవన అత్యవసర బృందం కార్యచరణ ప్రణాళిక, వివిధ వార్డులలో పారిశుధ్య పనులు నిర్వాహణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధృవీకరణ పత్రల జారీ, LRS, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడుదల, అక్రమ నిర్మాణల పై చర్యలు, అడ్వర్ టైస్మెంట్ పన్నుల వసూలు కోర్టు కేసులు, నూతన సంఘాల ఏర్పాటు, వివిద లక్ష్యాల సాదన, స్ట్రీట్ వెండర్స్ జోన్స్ విధానం, భువన్ జీయో ట్యాగ్గింగ్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్, ఆన్-అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులు చేపట్టుట, వీధి దీపాల నిర్వాహణ, రిపైర్స్, వన మహోత్సవం నందు టార్గెట్ ప్రకారము మొక్కలు నాటుట, సంరక్షణ పై సమీక్షించారు. కార్యక్రమంలో కమీషనర్ బి.శరత్ చంద్ర, AMC డి. చంద్రశేఖర్ రెడ్డి, Gy.EE జి. యాదయ్య, A.EE వి. రాజ్ కుమార్, మేనేజర్ టి. పర్వతాలు, RO. కె.శివకుమార్, TPS జి. రాకేష్, JAO M.స్వాతి, I/c. S.I జి.వెంకట్ రెడ్డి, TMC S. శ్రీలత, వివిధ సెక్షన్ ల అధికారులు శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.



## పోషణ ఆహారంతో పటిష్ట విద్యను అందించాలి

### తొర్రూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ కమలాదేవి

**తొర్రూరు, విశాలభారతి:**

అంగన్వాడి కేంద్రాలలో బలవర్ధకమైన పోషణ ఆహారంతో పాటు నిర్దిష్టమైన విద్యను అందించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని తొర్రూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ కె.కమలాదేవి అన్నారు. తొర్రూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర,నెల్లికుదురు మండలాల అంగన్వాడి టీచర్లకు పోషణ్ బి- పడాయి బీ,పోషణ మాసం పేరిట డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్ లో మూడురోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా సిడిపిఓ కె.కమలాదేవి మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడుతుందని,చిన్నారులు గర్భిణీలు బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ అంగన్వాడి కేంద్రాలలో మంచి పోషణ సమగ్ర విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. చిన్నారుల ఎదుగుదల మహిళల ఆరోగ్యానికి అంగన్వాడి కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు జరిగే ఈ పోషణ మాసంలో అంగన్వాడీ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య-పోషకాహారంపై చర్చలు, ప్రదర్శనలు, ప్రమాణ స్వీకారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ లు విజయలక్ష్మి, బి.సంకీర్తన, సూపర్వైజర్లు మల్లేశ్వరి, శ్రీదేవి, శోభ, గౌసియా, సునీత, నాగమణి,సమన్వయకర్త నడిగడ్డ అశోక్, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లా చొరబాటుదారులకు అండ

**పాట్నా:** ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' కూటమి తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం చేసిందన్నారు. బిహార్‌లోని డెహరీ ఆన్ సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రమంతా చొరబాటు-దారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ.. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బిహార్ చొరబాటు-దారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడానికి భాజపా యత్నిస్తుందని గతంలో ఇదే తరహా ఆరోపణలు చేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు కదా' అని కాషాయ శ్రేణులను ఉద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు.

# జీతాలు తగ్గించి మా నోటి కాడ బువ్వ గుంజుకోవద్దు

### కాంగ్రెస్ కి ఓట్లు వేసినందుకు జీతాలు తగ్గిస్తారా..?

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదు ధర్నా

### ముఖ్యమంత్రి ,మంత్రికి సమస్యలు వివరిస్తాం

### హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, విశాలభారతి:**



జీతాలు తగ్గించి మా నోటి కాడ బువ్వ గుంజుకోవద్దంటూ గిరిజన హాస్టల్ వర్కర్లు గురువారం నాడు పినపాక ఎమ్మెల్యే కార్యాలయం ముందు మణుగూరులో ధర్నా నిర్వహించారు. ఓట్లువేసి కాం గ్రెస్ ని గెలిపించినందుకు మా జీతాలు తగ్గిస్తారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఇచ్చిన జీవోలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి జీతాలు తగ్గించాలని నిర్ణయించడం ఎంతవరకు న్యాయమని హాస్టల్ వర్కర్లు ప్రశ్నించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ మరియు గిరిజన సంక్షేమ శాఖ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో హాస్టల్ వర్కర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యలతో పూర్ణ వింత పత్రాన్ని గిరిజన హాస్టల్ వర్కర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన కార్మికుల జీతాలు తగ్గించే విధంగా ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని రద్దు చేసే విధంగా ముఖ్యమంత్రి తోటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తోటి రేపు హైదరాబాదులో మాట్లాడుతానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు హీరాలాల్, చందా జలంధర్, కౌసల్య ,పండా మంగమ్మ కుమారి, రామచంద్రయ్య, జీవా, లక్ష్మి ,ముసలయ్య పాపయ్య,శ్రీరాములు, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
vishalabharathi Telugu Daily
శుక్రవారం
19.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

**ఆదిలాబాద్:** యూరియా విషయంలో స్పష్టత లేని కేంద్రం, రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం వహించిందని మాజీకేంద్రమంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాష్ట్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రకటన చేయలేదన్నారు. దీనికితోడు రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, మంత్రులు అనవసరంగా నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ఇకపోతే కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపైన, హామీలపైన స్పష్టత ఇవ్వడంలో విఫలమైన కేంద్రంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. యూరియాపై ఎందుకు స్పష్టత ఇవ్వరని అన్నారు. ఇప్పుడు దేశంలో ఆహార కొరతకు, ధాన్యం రేట్లు పెరగడానికి కారణం ఎవరని అన్నారు. తెలంగాణ పండించిన ధాన్యాన్ని బేషరతుగా కొనివుంటే ఇవాళ ఇంతటి సంక్షోభం వచ్చి ఉండేది కాదన్నారు. ఇంతకాలం తాము సంయమనంతో వ్యవహరించామని అన్నారు. తమ ఎంపిలు పార్లమెంటులో పోరాడినా లాభం లేకుండా పోయిందన్నారు.



## దసరాలోపు ప్రజలకు మంచి నీళ్లు అందించాలి

### గుంతలు పడ్డ రోడ్లను మరమ్మతులు చేయండి

### స్థానిక సమస్యలపై పీర్జాదిగూడ కమిషనర్ కి వినతిపత్రం

### మాజీ మంత్రి మల్లా రెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

**మేడిపల్లి, విశాలభారతి:**

పీర్జాదిగూడ నగర ప్రజలకు దసరాలోపు మంచినీళ్ళు అందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని పీర్జాదిగూడ కమిషనర్ త్రిళేశ్వర్ రావుకు మాజీ మంత్రి,మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లా రెడ్డి, మాజీమేయర్ జక్క వెంకట్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ నగరంలోని పలు కాలనీలలో ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలపై మాజీ కార్పొరేటర్లు, ప్రజలు, స్థానిక నాయకులతో కలిసి కమిషనర్ త్రిలేశ్వర్ రావుకి కలిసి వినతిపత్రం అందజేసారు. ఆయన మాట్లాడుతూ దసరా పండుగ లోగ ప్రజలకు మంచినీళ్లు అందించాలని అవసరమైన చోట నూతన పైప్ లైన్ ఏర్పాటు చేయాలని,సిసి రోడ్లు, డ్రైనేజి వంటి మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన పనులు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు.కమీషనర్ సానుకూలంగా స్పందంచారని అన్ని పనులకు టెండర్ వేశారని, మన సమస్యలు అన్ని ముందే అంచనా వేశారని దసరా లోపు అన్ని పనులు పూర్తిచేస్తారని తనదైన శైలిలో అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతురి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, జావీద్ ఖాన్,జిలాని పాషా, కోనేటి వెంకట్, యాసారంశ్రీనివాస్, అమర్ పటేల్, బత్తుల కిరణ్ వివిధ కాలనీల నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ భారత్‌లో బీజేపీ నాయకుడు

### తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సేవ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ అధ్యక్షుడు గోదా పాండు యాదవ్ ఆధ్వర్యం లో నిర్వహించిన సాయి బాబా నగర్ లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం లో రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవనీయులైన దేశ ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ భారత దేశాన్ని క్లీన్ కంట్రీగా తీర్చి దిద్దడాని కృషి చేయడం జరుగుతుందన్నారు క్లీన్ ఇండియాను సాధించాలన్న సత్సంకల్పంతో 2014 అక్టోబరు 2న భారత ప్రధాని నరేంద్ర మోదీ 'స్వచ్ఛ భారత్'కు శ్రీకారం చుట్టారని బహిరంగ మలవిసర్జనను అరికట్టడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రచారాన్ని చేపట్టారన్నారు ఈ కార్యక్రమం ద్వారా 100 మిలియన్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించారు 6 లక్షలకు పైగా గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహితంగా మారాయి కొనియాడారు సేవ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మనందరం కూడా నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలకు కానుకగా మైలార్దేవ్ పల్లి డివిజన్ ని స్వచ్ మైలార్ దేవ్ పల్లిగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ డివిజన్ ప్రెసిడెంట్ అడికి జనార్ధన్ సంతు గౌడ్, రావుల భాస్కర్ వెంకట రమణ నవారు మురళీధర్ రెడ్డి మన్మోహన్ రెడ్డి మసూదన్ రెడ్డి బొమ్మరాజు నరసింహ అడికి రాజు శ్రీకాంత్ రెడ్డి వినయ్ రెడ్డి గోపాల్ నాయక్ శేఖర్ రామారావు ప్రభుదాస్ కురుమయ్య శంకర్ రెడ్డి, జిహెచ్ఎంసి జవాన్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

### తహసీల్దార్ రాగ్య నాయక్

**అడవిదేవులపల్లి, విశాలభారతి:**

అడవిదేవులపల్లి మండలకేంద్రం లోని వైకుంఠదామం సమీపంలో గల ప్రభుత్వభూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని మండల తహసీల్దార్ రాగ్య నాయక్ హేచ్చరించారు. గురువారం నాడు మండలకేంద్రం లోని వైకుంఠదామం సమీపంలోగల 435 సర్వే నెంబర్ లో గల దాదాపుగా 30 ఎకరాలు బీడు గా ఉన్న ప్రభుత్వ భూములను మరియు అక్రమముగా ఓ కబ్జా దారుడు జేసీబీ తో చదును చేసిన భూమిని సర్వేయర్,రెవిన్యూ సిబ్బంది తో కలిసి ఆయన పరిశీలించినారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాగ్య నాయక్ మాట్లాడుతూ మండల కేంద్రనికి అతి దగ్గర లో ఉన్న వైకుంఠ దామం ప్రక్కన దాదాపుగా 30 ఎకరాల ప్రభుత్వ భూములను గ్రామం లోని నాయీ బ్రాహ్మణ కులస్తులు కొంతమంది మంగలి నాము గా నామకరణం చేసుకోని ఈ భూములను ఆక్రమించి కబ్జాలు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని అన్నారు. ఈ భూములలో జేసీబీ లు, మరియు యంత్రాలు వంటివి పెట్టి చదును చేస్తే అటువంటి వాహనాలను సీజ్ చేస్తామని, కబ్జా దారులపై చట్ట పరమైన చర్యలు తీసుకొంటామని అన్నారు.435 సర్వే నెంబర్ లో గల ఈ భూములపై ఏటువంటి భూ భారతి పట్టాదార్ పుస్తకాలు ఇవ్వబొమని తెలిపారు.కబ్జా దారులు పైరవిలకు ఆస్కారం లేదని ఎటువంటి వారికైనా ఈ భూములపై పట్టాలు ఇవ్వమని తెలిపారు. గ్రామానికి దగ్గర గా ఉన్న ఈ 30 ఎకరాల భూములు ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకొంటమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్. ఐ, సర్వేయర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీకి రానినేతలు అవసరమా



తెలుగు రాష్ట్రాల్లో చాలా విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అధికారం కోల్పోవడంతో విమర్శలే లక్ష్యంగా విపక్షంలో ఉన్న పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని ఎపిలో విపక్ష వైకాపా అధినేత జగన్ మొండిపట్టుతో ఉన్నారు. విపక్ష హోదా ఇవ్వండి అసెంబ్లీకి వస్తానని అంటున్నారు. ఇక తెలంగాణలో విపక్ష హోదా ఉన్నా కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు. అధికారం ఉంటే తప్ప అసెంబ్లీలో అడుగు పెట్టేది లేదన్న ధోరణిలో ఉన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న తరవాత అసెంబ్లీకి రావాల్సిందే. సమస్యలపై చర్చించాల్సిందే. అలా కాకండా జీతభత్యాలు మాత్రం ఠంచనుగా ఎత్తుకుంటున్నారు. ప్రజల సొమ్ము తింటున్న ఈ ఇద్దరు నేతలు ఇంత బాధ్యతారహితంగా ఉంటున్నారు. ఇలాంటి సమయాల్లో చట్టప్రకారం ఏం చేయాలన్నది ఆలోచన చేయాలి. ఇలాంటి వారిపై కొరడా ఝులిపిం చాలి. వారిని ఎమ్మెల్యేలుగా అనర్హులను చేయాలి. మళ్లీ ఎన్నుకోకుండా చూడాలి. ఇకపోతే అధికారంలో ఉండగా అప్పులు చేసి, విభజిత ఆంధ్రప్రదేశ్‌ను ఈ ఇద్దరూ కలిసి అప్పుల ఊబిలోకి నెట్టారు. ఇప్పుడేమో ఉన్న ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. నిజానికి వీరు ఎందుకు అప్పులు చేశారు.. ఎందుకు దివాళా తీయించారన్న దానికి సమాధానం లేదు. దేశంలో బహుశా ఇంతగా అప్పుల బారినపడ్డ రాష్ట్రాలు లేవేమో. అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణను పాటించలేదు. దీంతో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ అనుత్పాదక రంగాలకు విపరీతంగా దుబారా చేసారు. వీటినే అభివృద్ధి, సంక్షేమం అంటూ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకునే పనిలో ఉన్నాయి. ఆర్థిక క్రమశిక్షణతో పాటు, రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టి కరచిపోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ప్రధానంగా అభివృద్ధి పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఈ అప్పుల నుంచి బయటపడే మార్గాలు కూడా కనిపించడం లేదు. అలాగే అభవృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో విపక్షాలను దెబ్బతీయడం, విమర్శలను సహించక పోవడం వంటి చర్యలతో ఇద్దరు సిఎంలు నిరంకుశంగా పనిచేయడం ద్వారా తెలుగు రాష్ట్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాంటి రాష్ట్రాలను గాడిలో పెట్టాల్సిన ప్రస్తుత సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప ఆలోచన చేయడం లేదు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రజల్లో పలచన అయి, అధికారం కోల్పోయి, అసెంబ్లీకి రానని మంకు పట్టుతో ఉన్నారు. పార్టీలను అణగదొక్కడంలో కెసిఆర్ చేసిన కృషి ఇప్పుడు ఆయనకే ఎదురు తిరిగింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్న కుట్రతో చేసిన ప్రయత్నాలు బెడిసి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా చేశారు. దీంతో ఆయనా అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారు. కాంగ్రెస్, బిజెపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలించలేదు. వారి దెబ్బకు బిఆర్ఎస్ ఉనికిలేకుండా పోయింది. ఇలాంటి రాజకీయ నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచనచేయాలి. నిజాయితీ లేని రాజకీయ నేతలను పక్కన పెట్టడం నేర్చుకోవాలి. అసెంబ్లీకి రాని నేతలు ప్రజలకు ఏం సేవ చేస్తారో చూస్తున్నాం. అధికారంలో ఉన్నా మేలు చేయలేదు. విపక్షంలో ఉన్నా మేలు లేదని కెసిఆర్, జగన్‌లు నిరూపించారు. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30 ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను,ఆకాంక్షలను పట్టించుకోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా ఇప్పుడు అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. బిజెపి అక్కడ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారు. నిరాశా నిస్పృహలతో ఉన్న మమతా బెనర్జీ బిజెపి నేతలపై దాడులకు దిగుతోంది. ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల మనసెరిగి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. తెలంగాణల కూడా తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయ్యారు. ఇలాంటి దుస్తితి ఎదుర్కోవాల్సి వస్తుందిన ఊహించి ఉండక పోవచ్చు. పశ్చిమబెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఏ తప్పు చేశారో తెలంగాణలో కూడా కేసీఆర్ అదే తప్పు చేసారు. పశ్చిమ బెంగాల్‌లో బలంగా ఉన్న వామపక్షాలను మమతా బెనర్జీ బలహీనపరిచారు. ఎపిలో కూడా జగన్ టిడిపిని తిట్టడం,కేసులు పెట్టడం, లేపేయడం వంటి చర్యలకు ప్రోత్సాహం ఇవ్వండం తో ప్రజలు తిరిగి టిడిపిని ఎన్నుకున్నారు. ప్రజలు మెచ్చేలా పాలన అందించినంతవరకు పాలక పార్టీకి దిగులు లేదు. అయితే ఇది విస్మరించి వ్యహరించడంవల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్‌లు గడ్డు పరిస్థితులను ఎదుర్కొం టున్నారు. వారు అసెంబ్లీకి వచ్చి తమ హయాంలో మంచిచేస్తే మంచిని చెప్పాలి. విపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలి. సమస్యలపై నిలదీయాలి. కానీ అధికార పక్షం ఎదురుదాడిని తట్టుకోలేక భయంతో అసెంబ్లీకి ముఖం చటేస్తున్నారు. ఇప్పుడు భారతీయ జనతాపార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది. బీజేపీ ఇంతలా బలం పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించడంలేదు. బిఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వా మ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. అసెంబ్లీకి వెళ్లకుంటే నష్టపోయేది జగన్, కెసిఆర్‌లు మాత్రమేనని

## అనేక గ్రామాల్లో తొలగని బురద

### సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే మార్గం

### సవాల్‌గా మారిన పారిశుద్ధ్య నిర్వహణ

**ఏలూరు:** ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవలి వర్షాలు వరదల కారణంగా పలుప్రాంతాలు కంపు కొడుతున్నాయి. అనేక లంకగ్రామాలు, విలీన మండలాల గ్రామాలు ఇంకా బురదలోనే ఉన్నాయి.ప్రజలు దీంతో సహవాసం చేస్తూ అవస్థలు పడుతున్నారు. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ఇటీవల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలు తున్న విషయం సుస్పష్టం. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి.

## కాకులకే ఎందుకు పిండం పెట్టాలి

**తిరుమల:** మహాలయంలో అంటే పితృపక్షాల సమయంలో మనం కాకులకు ఆహారం ఎందుకు పెడతాము? మన పూర్వీకులు కాకులుగా మారారా? అయితే ఇంతటి అల్ప పక్షిగా ఎందుకు మారారు? ఏదైనా పెద్ద స్థాయిలో ఉన్న పక్షిగా ఎందుకు మారలేదు?'అని భక్తుడొకరు పరమాచార్య స్వామివారిని అడిగాడు. స్వామివారు ఒకసారి చిరునవ్వి, 'తమిళంలో మనం కాకిని 'కాకా' అని పిలుస్తాము. ఇక ఏదైనా ప్రాణిని మనం అవి చేసే శబ్దాలతో పిలుస్తామా? పిల్లిని 'మ్యావ్' అని, చిలుకలు కికి అంటాయి కాబట్టి వాటిని 'కికి' అని పిలుస్తామా? లేదు! కాకిని దాని అరుపుతో పిలుస్తాము. అదే దాని ప్రత్యేకత. క అంటే కాపాత్తు (కాపాడు), రక్షించు అని అర్థం. కనుక నువ్వు కాకికి ఆహారం పెట్టి 'కా కా' అని పిలిస్తే, కాపాడు అని పితృదేవతలని అడిగినట్టు!విరివిగా ఉంటాయి, ఏది పడితే అది తింటాయి

## మహిళలపై అకృత్యాలకు చర్యలేవీ

### కఠినంగా శిక్షలు వేస్తేనే మార్పు సాధ్యం

**అమరావతి**: ఇటీవల నల్లగొండలో ఫోక్సో కోర్టులు రేపిస్టులకు జైలుశిక్షలు వేశాయి. సీవిత ఖైదు విధించాయి. అయితే ఇవన్నీ ఆలస్యంగానే అమలవుతున్నాయి. కఠిన శిక్షలు వెంటనే అమలు కావాల్సిన అసవరం ఉంది. ఎన్ని కఠిన చట్టాలను తీసుకుని వచ్చినా లైంగిక వేదింపులు, ప్రేమదాడులు ఆగడం లేదు. అలాగే వరుస ఘటనలు ఎపిలో ఆందోళన కలిగిస్తున్నాయి. మృగాళ్ల కారణంగా ఆడపిల్లలకు భయం కలుగుతోంది. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు మరింత క్షోభకు గురవుతున్నారు. ఇప్పుడు భయపడేలా పరిస్థితులు దాపురించాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సత్వర శిక్షలు అమలు చేయాలని యావత్ దేశం కోరుకుంటున్న వేళ కఠిన చట్టాలపై ఆలోచన చేయాలి. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష విధించేలా చట్టాన్ని రూపొందించాలి. దీనిని నిర్ధారించే ఆధారాలున్నప్పుడు 21 రోజుల్లోనే తీర్పు ఇచ్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలి. మహిళలపై అత్యాచారానికి పాల్పడితే అతి త్వరగా నిందితులకు మరణశిక్ష పడేలా చట్టం తీసుకుని రావాలి ఇటువంటి కేసుల్లో నిందితులను దోషులుగా నిర్ధారించే ఆధారాలున్నప్పుడు మూడు వారాల్లోగా అంటే 21 వర్కింగ్ డేస్ ల్లో తీర్పు వచ్చేలా క్రిమినల్ లా చట్టంలో మార్పులు తేవాలి.. కానీ ఇటీవలి ఘటనలు మృగాళ్లలో భయాన్ని కలిగించడం లేదని తెలిస్తోంది. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరకారించందనో లేక తనను ప్రేమించడం లేదనో లేకపోతే..ఒంటరి అమ్మాయిలను లేదా మహిళలను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రేప్‌లు చేయడం, హత్యలు చేయడం చాలా సులువైన పనిగా చూస్తున్నారు. మహిళలు, చిన్నారులపై నేరాల విచారణకు ప్రతి జిల్లాలోను ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. అత్యాచారం, యాసిడ్ దాడులు, వేధింపులు, లైంగిక వేధింపులు వంటి హింసాత్మక ఘటనల్లో నేరాల విచారణకు ప్రతి జిల్లాల్లోను ప్రత్యే కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. అంతేకాదు సోషల్ మీడియా వేదికగా బాధిత మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాలకు అడ్డుకట్టవేసేలా చట్టాన్ని రూపొందించాలి. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపాలి. నిజానికి ఆడవాళ్లపై అకృత్యాలు జరిగిన వెంటనే ఉపశమనం కలిగే చట్టం రావాలని తల్లిదండ్రులు, ప్రతి మహిళ, చెల్లి, ప్రతి ఇంట్లోని ఆడపిల్ల ఎదురు చూస్తోంది. ప్రభుత్వం కఠిన చట్టంతో మహిళలకు భద్రత ఇస్తోందన్న భరోసా రావాలి. అయితే చట్టాలు ఉన్నా ప్రజల్లో మార్పులు మాత్రం రావడం లేదు. దుండగులను కఠినంగా అణచివేస్తే తప్ప మహిళలకు రక్షణ ఉండదని తేలిపోయింది. కఠినంగా అణచివేత చర్యలకు ఉపక్రమించాలన్ని సర్వత్రా విజ్ఞప్తులు వస్తున్నాయి. భయం కలిగేలా పోలీసులు వ్యవహరించాలని కూడా యువతులు కోరుకుంటున్నారు.